క్లుప్తంగా

జగనన్న సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష



కిట్లు అందజేస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: ప్రతి కుటుంబానికి ఉచిత వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని నగర పాలక సంస్థ మేయర్ శిరీష అన్నారు. మంగళవారం 2, 25వ డివిజన్లలో వైద్య శిబిరాలను పరిశీలించారు. కిట్లు, మందులు పంపిణీ చేశారు. శిబిరాలకు రాలేని వాళ్లకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే వైద్యం అందిస్తారని తెలిపారు. కార్పొరేటర్లు నరసింహచారి, ఉమా యాదవ్ పాల్గొన్నారు.

తాత్కాలిక దుకాణాలకు బహిరంగ వేలం

చంద్రగిరి: స్థానిక గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఆవరణలో తాత్కాలిక దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలో 2023–2024 వరకు పూజా సామగ్రి విక్రయాలు, తలనీలాలకు వేలం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాపు సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణదేవరాయలు 494వ వర్ధంతి సందర్భంగా మంగళవారం తిరుమల బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్క్ వద్దనున్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కాపు సంఘం నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, డాక్టర్ పీఎస్. కరుణానిధి, భాస్కర్, నాగరాజ రాయల్, ఈశ్వర రవిశంకర్, సరితానాగరాజు, కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు అజయ్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితాకు సహకరించాలి

తిరుపతి తుడా: సమగ్ర ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి హరిత అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో సమీక్షించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఆర్‌బీకేల్లో నాణ్యమైన ఎరువులు

భాకరాపేట: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లె రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. బస్తా యూరియా రూ.266, డీఏపీ రూ.1350, 10:26:26 రూ.1470తో విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏడీఏ ధనంజయరెడ్డి, ఏఓ ఖాదర్‌బాషా ఉన్నారు.

వేగవంతంగా విగ్రహ నిర్మాణ పనులు



పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ పట్టాభిరెడ్డి

పాకాల: ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో స్వామివారి విగ్రహ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. మంగళవారం పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా నవంబర్ ఒకటో తేదీ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఆలయ ఆవరణలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ లోకనాథం, రమేష్, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

వర్సిటీలో నిర్మాణ పనుల పరిశీలన

తిరుపతిసిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో అంతర్జాతీయ కార్యాలయ నిర్మాణాన్ని వీసీ భారతి, ఇంటర్నేషనల్ రిలేషన్ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. త్వరలో వర్సిటీలోని మూడు అంతస్తుల భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నవంబర్ నాటికి భవనాన్ని పూర్తి చేస్తామన్నారు.

తివారీ మిశ్రాకు సన్మానం

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇన్వెస్ట్ ఇండియా కమిటీ ప్రతినిధి జగీష్ తివారీ మిశ్రాను కలెక్టర్ వెంకటరమణారెడ్డి సన్మానించారు. వెంకటగిరి చేనేత పరిశ్రమను పరిశీలించిన బృందం తిరుమల శ్రీవారి దర్శనం నిమిత్తం తిరుపతికి వచ్చింది.

సింహ వాహనంపై విహరిస్తున్న మలయప్ప స్వామి



కళా ప్రదర్శనలు భళా..

- శ్రీవారి వాహన సేవల్లో ఆకట్టుకుంటున్న కళారూపాలు
- భక్తజనరంజకంగా వేషధారుల అభినయాలు
- టీటీడీ ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేస్తున్న కళాకారులు



అన్నమయ్య వంశీకులు హరినారాయణ



ఆధ్యాత్మిక పుస్తకాలు ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఈఓ ధర్మారెడ్డి, పాలకమండలి సభ్యులు

తిరుమల : శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన మంగళవారం ఉదయం సింహ వాహనసేవ జరిగింది. వివిధ ప్రాంతాల కళాబృందాలు అద్భుత ప్రదర్శనలిచ్చాయి. తమిళనాడులోని శ్రీరంగానికి చెందిన రాజీ బృందం మొయిల్లాట్టం నృత్యాన్ని అభినయించింది. చెన్నైకి చెందిన పుష్కల బృందం శ్రీనివాస పద్మావతి అమ్మవారి నృత్యంతో కనువిందు చేసింది. చిత్రా శివకుమార్ నేతృత్వంలో భరతనాట్యాన్ని ప్రదర్శించారు. లత బృందం మీనాక్షి అమ్మవారి నృత్యంతో అలరించారు. సేలానికి చెందిన శ్రీ రాజా బృందం గోపికా నృత్యాలతో అలరించారు. పాండిచ్చేరికి చెందిన విచిత్ర బృందం భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. బెంగుళూరుకు చెందిన అభిరామి ఆధ్వర్యంలో చంద్రచూడా నృత్యంతో కనువిందు చేశారు. విజయవాడకు చెందిన వైజయంతిమాల ఆధ్వర్యంలో కోలాటాలు, వైజాగ్‌కు చెందిన పరమేశ్వర శర్మ బృందం కోలాటాలతో అలరించారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు.

శ్రీవారి అనుగ్రహంతోనే..

వివిధ కళాబృందాల వారు మాట్లాడుతూ శ్రీవారి అనుగ్రహంతోనే తిరుమాడ వీధుల్లో ప్రదర్శనలు ఇచ్చే మహద్భాగ్యం దక్కిందన్నారు. కళాకారులకు టీటీడీ చక్కటి బస, భోజన ఏర్పాట్లు చేసిందన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

సింహ వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆవిష్కరించారు. అందులో ఏ.తారకరామారావు శ్రీవేంకటేశ్వర సచిత్ర సుప్రభాతం, నిత్య ప్రార్థనా శ్లోకాలు, కోదండపాణి నాటకం ఉన్నాయి. ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీటీడీ జేఈఓ సదా భార్గవి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, ఉప సంపాదకుడు నరసింహాచార్య పాల్గొన్నారు.

నృత్య నీరాజనం

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రం, శ్రీరామచంద్ర పుష్కరిణిలో కళాకారుల ప్రదర్శనలు, నాటికలు భక్తులను ఆకట్టుకున్నాయి.









మహతి కళాక్షేత్రంలో శ్రీరామజయం పౌరాణిక పద్య నాటకం

ఆధ్యాత్మిక వైభవం

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి మంగళవారం ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. - తిరుపతి రూరల్



భక్తులకు అన్నదానం



సింహవాహన సేవ ముందు డోలు వాయిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



వేంకటేశ్వరస్వామి, దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు

- సీఐలు రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి



చంద్రగిరి: అఖిలపక్షం నాయకులతో మాట్లాడుతున్న సీఐ

చంద్రగిరి/తిరుపతి రూరల్: వ్యక్తులు, పార్టీలను కించపరిచేలా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చంద్రగిరి, తిరుపతి రూరల్ సీఐలు రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. ఆయా సర్కిల్ కార్యాలయాల్లో మంగళవారం మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన ఇతర పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల విధివిధానాలు, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టుకోవడం వారి ఇష్టమని.. అలా కాకుండా ఓ వ్యక్తిని, పార్టీని కించపరిచే విధంగా పోస్టులు పెట్టడం, వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయం అనిపించుకోదన్నారు. సదరు పోస్టుల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడంతో పాటు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తత నెలకొనే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల స్టేషన్లకు వస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికం రాజకీయ దూషణలు, అసత్య ప్రచారాలకు సంబంధించినవే వస్తున్నాయన్నారు. అలాంటి పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎస్‌ఐలు రవీంద్ర నాయక్, నరేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నేత పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, బీజేపీ నేత మురళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు

–కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇంజినీరింగ్, ఆరోగ్యశాఖ, మలేరియా విభాగం అధికారులతో ఆమె సమీక్షించారు. నగరంలో ప్రతి రోజూ తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలన్నారు. డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా గంగమ్మ



గాయత్రీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ



శ్రీరాజరాజేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరి



భాకరాపేట: రాజరాజేశ్వరి దేవిగా తిరుపతి గంగమ్మ



రామచంద్రాపురం: బాదూరమ్మ, పుట్టాలమ్మ



చంద్రగిరిలో గజలక్ష్మిగా మూలస్థాన ఎల్లమ్మదేవి

తిరుపతి కల్చరల్: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, సహస్రనామార్చన చేశారు. అలాగే కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి శ్రీరాజరాజేశ్వరి దేవిగా, సాయంత్రం మీనాక్షిదేవిగా భక్తులను అనుగ్రహించారు.

భాకరాపేట/రామచంద్రాపురం/చంద్రగిరి: చిన్నగొట్టిగల్లు చెరువుకట్టపై వెలసిన తిరుపతి గంగమ్మ రాజరాజేశ్వరి దేవిగా, కుప్పంబాదూరులోని బాదూరమ్మ, పుట్టాలమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. అలాగే చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ గజలక్ష్మీ అలంకరణలో భక్తులను కటాక్షించారు.

చంద్రగిరిలో వాటర్‌పార్క్



బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్

చంద్రగిరి: చంద్రగిరి పరిధిలోని జాతీయ రహదారి నుంచి మల్లయ్యపల్లి వెళ్లే మార్గంలో గ్రాండ్ వరల్డ్‌కు చెందిన నిర్వాహకులు బ్లూ ల్యాండ్ పేరిట వాటర్ పార్కును ఏర్పాటు చేశారు. మంగళవారం పూజలు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులతో పాటు జిల్లా వాసుల కోసం సుమారు 5 ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేశామన్నారు. ఆర్టిఫిషియల్ వేవ్స్, వాటర్ డ్యాన్స్, చిల్డ్రన్స్ వాటర్ గేమ్స్, ఫ్యామిలీ అడ్వెంచర్స్‌లతో పాటు రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

కెశ్విన్ టీవీఎస్‌లో దసరా ఆఫర్స్



కెశ్విన్ టీవీఎస్ షోరూం

తిరుపతి కల్చరల్: తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని కెశ్విన్ టీవీఎస్ షోరూంలో 4వ వార్షికోత్సవం, దసరా సందర్భంగా ప్రత్యేక ఆఫర్స్ అందిస్తున్నట్లు షోరూం అధినేత ఆర్.ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి వాహనం కొనుగోలుపై 5 గ్రాముల సిల్వర్ కాయిన్‌తో పాటు కచ్చితమైన బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. అతి తక్కువ డౌన్ పేమెంట్, వడ్డీరేటు, ఎక్స్ఛేంజ్ వాహనాలపై జీరో డౌన్ పేమెంట్, స్పాట్ డెలివరీ అందిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701766666ను సంప్రదించాలని కోరారు.

పెళ్లి కానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

తిరుపతి మంగళం: మంగళం సప్తగిరికాలనీ పంచాయతీలో వివాహం చేసుకోనున్న ఎం.సురేష్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను ఉపసర్పంచ్ అశోక్ రెడ్డి అందజేశారు. బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూప్రసాదంతో కూడిన కానుకను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మహ్మద్‌కాసీమ్‌బాషా, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి సిటీ: చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం సొంతమవుతుందని, ఆహారంలో అవి భాగం కావాలని ఎస్వీయూ హోమ్‌సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ కోలా మంజుల అన్నారు. మంగళవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో బోధనేతర సిబ్బందికి చిరుధాన్యాల వినియోగం, ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మిల్లెట్స్ వినియోగంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టవచ్చని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి



సచివాలయం ఎదుట గ్రామస్తుల నిరసన

రామచంద్రాపురం: సొరకాయల పాలెం పంచాయతీ సెక్రటరీ సుకుమార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంగళవారం సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్న ఆయన్ను విధుల నుంచి తొలగించాలంటూ నినాదాలు చేశారు. గ్రామ సమస్యలు పట్టించుకోకుండా మహిళలతో అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.